


# విశ

బిమ్మని మనోహర

"ఛీ నీయవ్వ - ఏం సదివి నోళ్ళో! గిదేనా మీ సదువులు మీకు నేర్పింది? మీ కుజ్జోగాలెందుకు - సినిమా టాకీసుల్ల బ్లాకు టికెట్లమ్ముకొపోండ్రి!"

కాకీ బట్టల్లో, ఇప్పుడో అప్పుడో రిటైర్ కావడానికి సిద్ధంగా వున్న ఆ వయస్సు మళ్ళిన వ్యక్తి అన్న మాటల్ని వినవల్సిన వాళ్ళెవరూ విన్నట్టులేదు. విన్నవాళ్ళు తమని కాదనుకున్నారేమో. వులుకూ పలుకూ లేకుండా క్యూలో అలాగే నిల్చున్నారు. రఘు హృదయం మాత్రం కలుక్కుమంది.

మధ్యాహ్నం. ఆలస్యంగా వచ్చిన వర్షాకాలం మబ్బులు అక్కడక్కడా కమ్ముకున్నాయి. వాన కురుస్తుందో లేదోగాని, గాలి మాత్రం ఆడటం లేదు. సర్వీసు కమిషన్ ప్రకటించిన ఉద్యోగాలకు అప్లై చేసుకోడానికి అది చివరి రోజు. కమిషన్ ఆఫీసు చుట్టూ తెరిచిన కౌంటర్ల ముందు క్యూలు కట్టి అసహనంగా నిల్చుని వున్నారు జనం. వచ్చేవాళ్ళు వస్తున్నారు, పోయేవాళ్ళు పోతున్నారు. కాంపౌండులో జనం మాత్రం తగ్గటం లేదు.

ఎప్పటి నుంచో క్యూలో నిల్చునివున్నవాళ్ళను ఎగతాళి చేస్తున్నట్టుగా, కొందరు రావటం రావటమే ముందునుంచి అప్లికేషన్లిచ్చి దర్జాగా వెళ్తున్నారు. గేటుదగ్గర కూర్చున్న ఆ ముసలి వాచ్‌మన్ ఇందాక ఆ మాటలన్నది వాళ్ళనుద్దేశించే!

గంటన్నరనుంచీ క్యూలో నిల్చున్న రఘుకు నిజంగా బాధేసింది. అసలీ చదువులు ఏం నేర్పుతున్నాయి? ఏం నేర్వాలి? ఒకప్పుడు చదువుకున్నవాళ్ళంటే చాలు - సంఘంలో ఎంతో గౌరవం వుండేది. ఇప్పుడు - చదువుతో పాటు ఏదయినా గవర్నమెంటు వుద్యోగం సంపాదిస్తే తప్ప కనీస గౌరవం లేదు. లేదంటే, ఏం చేసైనా సరే డబ్బు సంపాదించాలి! వాళ్ళకే సంఘంలో విలువా, గౌరవం అన్నీ. ఈ రెండిట్లో ఏది సంపాదించలేకపోయినా వాడుట్టి అసమర్థుడు. ఈ ఉన్నతవిద్యలూ, ఈ మేధాకవిత్వం అన్నీ శుద్ధ దండగ. ఇవీ, మన చదువులు మనకు నేర్పిన దృక్పథం, మనం అలవర్చుకున్న దృక్పథం!

"హలో! కొంచెం కదలండి ముందుకు!"

వెనక నిల్చున్న యువకుడు జరిగి, క్యూలో తన ముందు ఏర్పడ్డ 'ఖాళీ'ని భర్తీ చేశాడు. మళ్ళీ కొంచెం సేపటివరకూ క్యూ కదలదు. జేబులోంచి కర్చీఫ్‌తీసి నుదుటి మీద, చేతులకు పట్టిన చమటను తుడుచుకున్నాడు. చేతిలో వున్న 'కాంపిటీషన్ మాస్టర్'నూ, అందులోవున్న అప్లికేషన్నూ కాసేపు తిరగేశాడు. నత్తలా కదులుతున్న క్యూ విసుగు పుట్టించిందతనికి. స్నేహితులెవరైనా వున్నారేమోనని నిల్చున్న చోటి నుంచే ఓసారి చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు.

"ఇంకా గంట సేపు పడ్తుందేమో!" - ఇందాక తన ఆలోచలను భగ్నం చేసిన వ్యక్తే వెనకనుంచి మళ్ళీ అన్నాడు. అప్లికేషన్ను కౌంటర్లో యిచ్చేవరకూ, మాట్లాడకుండా, ఆ ఎండలో నిల్చుని వుండాలంటే కష్టంగా వుందతనికి.

"ఆ . . . . " అన్నాడు రఘు. సంభాషణను పొడిగించలేకపోయాడతను. ఓ నిముషం తర్వాత మళ్ళీ వెనకున్న యువకుడే కదిలించాడు.

"మీరు డిగ్రీనా, 'పీజీ' కూడా వుందా?"

"ఎమ్మే సోషియాలజీ చేశాను. అయాం రఘు!" మాట్లాడక తప్పలేదు.

"మోహన్! ఎమ్మెస్సీ మేథమెటిక్స్"

నిరాశా నిస్పృహలకు అద్దం పడుతున్న ఆ యిద్దరి కళ్ళలోనూ నిర్జీవపు మెరుపొకటి పలకరింపుగా, పరిచయంగా క్షణం పాటు మెరిసి మాయమైంది.

క్యూలో వూరికే నిల్చోవడం కన్నా ఏదో ఒకటి మాట్లాడుతూ గడపటమే మంచిదనిపించిందేమో. ఈసారి తనే మాట్లాడాడు రఘు.

"ఇప్పుడేం చేస్తున్నారు మీరు?"

"ట్యూషన్లు, ట్యుటోరియల్సు . . . . . . నాలుగేళ్ళనుంచీ!"

"మీ మేథమెటిక్సు, ఇంగ్లీషు వాళ్ళకు బావుంది. వుద్యోగం లేకపోయినా ట్యూషన్లు చెప్పుకొని బతకవచ్చు! మా కోర్సులకే అటు విలువా లేదు - ఇటు బ్రతుకుదెరువూ లేదు."

" ఏం బాగున్న గవర్నమెంటు వుద్యోగం కాదుగా! భద్రతేది?. . . . నేను రెండు ట్యుటోరియల్సులో పని చేస్తున్నాను. రేపెవరయినా ఎమ్మెస్సీ మేథమెటిక్సు 'రెడ్డి' దొరికితే ఒకాయన పీకేస్తాడు. 'శర్మనో శాస్త్రో' దొరికితే మరొకాయన పీకేస్తాడు. ఇలాగే మిగతావాళ్ళూ! నాలుగేళ్ళ నుంచి ఇట్లా తిరుగుతూనే వున్నాను"

ఇదంతా చెబుతున్న మోహన్ ముఖంలో ఎటువంటి భావమూ లేదు, నిరాసక్తత తప్ప.

"ప్రైవేటు కాలేజీల్లో ట్రై చేయలేదా?" అడిగాడు రఘు.

"అక్కడా అంతే! వాళ్ళిచ్చే వెయ్యి రూపాయల జీతానికి 'లీజర్ లేకుండా క్లాసులూ తీసుకోవాలి. ఇతర చాకిరీ ఎలాగూ వుంటుంది. 'వాళ్ళ మనుషు'లొచ్చినపుడు కూడా మనకు ఉద్వాసన ఎలాగూ తప్పదు!"

ఇటువంటి విషయాలు మాట్లాడుకోవడమే వృధా అన్నట్టు, మోహన్ ముఖంలో అదే నిరాసక్తత!

"టీచర్ పోస్టులు కూడా మీకు చాలా ఉంటాయిగా . . . . 'బీ. ఇడి.' చేయాల్సింది!"

"అదీ చేశాను. మొన్న జిల్లా సెలక్షన్లలో ఇంటర్వ్యూ క్కూడా వెళ్ళాను. కేసులు, అవకతవకలు మామూలే! తర్వాత గవర్నమెంటు మారింది, రిక్రూట్మెంట్లు ఆగిపోయాయి. మళ్లీ వుద్యోగాలిచ్చినా - లోపల్లోపల ఏమైనా జరిగాయో లేదో తెలీదుగాని, నాకు మటుకు వుద్యోగం రాలేదు!"

క్యూ మరికాస్త ముందుకు కదిలింది.

"మీరూ 'బీ. ఇడి. 'చేశారా?" అడిగాడు మోహన్.

*ప్రయోజనశూన్యాలైన డిగ్రీలను ప్రసాదించడానికి కోట్లాది రూపాయల్ని ఖర్చు చేస్తున్న ఈ యూనివర్సిటీల మీద ఆగ్రహం కలిగిందతనికి. కడుపునింపని ఈ డిగ్రీలనే, 'వన్ సిట్టింగ్‌లో పాస్ గ్యారంటీ' అంటూ వ్యాపారం చేస్తున్న బ్రోకర్ల చేతుల్లో ఓ అమ్మకపు వస్తువుగా మార్చిన ఈ విద్యావ్యవస్థని తల్చుకొని ఆక్రోశించిందతని హృదయం.*

"ఆ . . . నేను కూడా మొన్నటి సెలక్షన్లో సెలక్ట్ కాలేదు.

"ఇప్పుడేం చేస్తున్నారు?" మళ్లీ మోహనే అడిగాడు.

"ఎం. ఫిల్!"

"ఏమయినా లాభముందా అది చేస్తే?'

"ఏవీ లేదు! ఎం. ఫిల్‌లు, పీహెచ్‌డీలు చేసి కూడా రోడ్ల మీద తిరుగుతున్న వేలాది నిరుద్యోగులలో నేను ఒకణ్ణవుతాను!"

"మరి . . . తెలిసీ అనవసరంగా ఎందుకు చేయడం?"

"రెండేళ్లు క్యాంపస్‌లో వుండొచ్చునని! తర్వాత 'పి.హెచ్‌డి'కి మరో మూడేళ్ళు! అయితే - ఈలోగా కాంపిటిటివ్ పరీక్షలు రాసి, ఏదైనా వుద్యోగం 'సంపాదించుకో'గలిగితేనే లాభం. లేకపోతే పనికిరాకుండా పోవడం ఖాయం .... వృద్ధాప్యం కూడా క్యాంపస్‌లోనే వస్తుంది!"

"ఫర్వాలేదు - మన కోసం యూనివర్సిటీ హాస్టళ్లయినా వుపయోగపడ్తున్నాయి!" నవ్వుతూ అన్నాడు మోహన్.

" నిజంగా వుపయోగపడ్తున్నవి హాస్టళ్ళే! ఐదారేళ్ళక్రితం వరకూ అంతో యింతో క్లాసులకు అటెండయ్యేవాళ్ళు. ఇప్పుడు అదీ లేదుగా! తాతల నాటి సిలబస్‌లను, బోధనాపద్ధతులను చాలా 'సెక్యూర్డ్'గా ఇంకా కొనసాగిస్తూ వస్తుంటే ఎవరయినా ఎందుకటెండవుతారు? పరీక్షలకు పదిరోజుల ముందు - సెలబస్, పాత కొశ్చన్ పేపర్లు నాలుగు సార్లు తిరగేసి, సీరియస్‌గా కూర్చుంటే చాలు -ఫస్ట్ క్లాసులు, గోల్డు మెడల్సు వూరికే వస్తున్నాయి! ఏవో కొన్ని సైన్సు సబ్జక్టులు తప్పిస్తే అన్నిట్లో యిదేగా పరిస్థితి! ఇంకెందుకు క్లాసులు?"

ప్రయోజనశూన్యాలైన డిగ్రీలను ప్రసాదించడానికి కోట్లాది రూపాయల్ని ఖర్చు చేస్తున్న ఈ యూనివర్సిటీల మీద ఆగ్రహం కలిగిందతనికి. కడుపునింపని ఈ డిగ్రీలనే, 'వన్ సిట్టింగ్‌లో పాస్ గ్యారంటీ' అంటూ వ్యాపారం చేస్తున్న బ్రోకర్ల చేతుల్లో ఓ అమ్మకపు వస్తువుగా మార్చిన ఈ విద్యావ్యవస్థని తల్చుకొని ఆక్రోశించిందతని హృదయం.

నిరాశా నిస్పృహల్తో చేవచచ్చిన క్యూలో చలనం మరింత మందగించింది. కౌంటర్లో వ్యక్తి 'టీ' తాగుతున్నట్టున్నాడు. కామెంట్లు చేస్తున్నారు. కొంత మంది తను 'ప్లేస్'ను ముందున్న వ్యక్తికో వెనక ఉన్న వ్యక్తికో అప్పగించి, మంచినీళ్ళో - టీనో తాగడానికెళ్తున్నారు. రఘు, మోహన్‌లు కూడా రోడ్డుమీదున్న బండి దగ్గర టీ తాగడానికెళ్ళారు.

తిరిగి వస్తోంటే, ఎదురుగా కనిపిస్తున్న సర్వీస్ కమిషన్ భవనం

వాళ్ళకు ఓ మాంత్రికుడి భైరవద్వీపంలా కనిపించింది. ఆ ద్వీపంలోంచి ఏ అద్భుతదీపాన్నో, ఏదో ఓ రోజు, శోధించి సాధించలేకపోతామా అన్న ఆశతో దానిచుట్టూ మూగినట్టుగా వున్నారు జనం.

ఫలితమివ్వని పంచవర్ష ప్రణాళికల్లా, ఏ ఐదేళ్ళకో ఒకసారి ప్రకటించే ఉద్యోగాలు, ఆతర్వాత ఐదేళ్లకి ప్రకటించే ఫలితాలు నిరుద్యోగులందరికీ అద్భుతదీపాల్లాగే కనిపిస్తున్నాయి. అవసరం, ఆకలి వాళ్లను అల్లావుద్దీన్‌లను చేస్తే, ఆశ వాళ్ళను బలవంతంగా ఆ ద్వీపంలోకి తోసివేస్తుంది. కనిపించని ఆ అద్భుతద్వీపాలకోసం వెదుకుతూ, వెదుకుతూ చివరికి అందులోనే సమాధికానున్న వాస్తవం వాళ్ళకు తెలియదు. ఆ వాస్తవం తెలిసేటప్పటికి, అప్పటికే, ఆలస్యమైపోతుంది.

మళ్లీ క్యూలో చేరిపోయారిద్దరూ.

" ఏ వూరు మీది?" అడిగాడు మోహన్.

"ఖమ్మంలో 'బుగ్గరేవు' అని ఓ చిన్న గ్రామం"

"మాది కూడా చాలా చిన్న పల్లె - వరంగల్లులో. ఇక్కడ చిక్కడపల్లిలో వుంటున్నాను."

ఇద్దరూ కాసేపు మౌనంగా వున్నారు. క్యూ నెమ్మదిగా కదులుతోంది.

"ఇంక వేటికైనా ప్రిపేరవుతున్నారా?" మళ్లీ సంభాషణ ప్రారంభించాడు రఘు.

"మిగతా అన్నిటికీ కూర్చునే వయస్సు దాటింది . . . 'ఏజ్‌బార్!"

"మనిద్దరికీ మిగిలింది ఇదొక్కటే అన్నమాట! . . . . వూళ్ళ నుంచి వచ్చేవారందరి పరిస్థితీ యిదే - కోర్సుల గురించీ, ఉద్యోగాల గురించీ, కాంపిటీటివ్ పరీక్షల గురించీ తెలుసుకొని, ఓ అవగాహనకొచ్చేసరికే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది!"

ఇద్దరి పరిస్థితులూ, ఆలోచనలూ దాదాపు ఒకేలా వుండటం ఆ యిద్దర్నీ కొద్దిగా ఆశ్చర్యపర్చింది. ఆ యిద్దరి పరిస్థితే కాదు, దేశంలో వున్న నిరుద్యోగులందరి పరిస్థితీయిదేనన్న వాస్తవం ఆ క్షణం తట్టలేదు.

"ఈ అరవై వుద్యోగాలకు ఎంతమంది అప్లై చేసారంటారు?" అడిగాడు మోహన్.

"ఈజీగా రెండులక్షలమంది అప్లై చేస్తారు! అయినా లాభమేంటి? ఎప్పట్లానే రిటెన్‌టెస్టులు వాయిదా, అభ్యర్థుల కేసులు, అవన్నీ తెగాక ఇంటర్వ్యూలు, పైరవీలు, మళ్లీ కేసులు, ఆత్మహత్యా ప్రయత్నాలు, ఆకలి చావులు . . . . ఆ తర్వాతెప్పుడో రిజల్టులు! ఇదంతా మామూలే . . . "

"వీళ్లు మళ్లీ నోటిఫికేషన్ యిచ్చేసరికి దానిక్కూడా మన 'ఏజ్ బారయిపోతుంది!" అప్పటివరకూ మామూలుగా మాట్లాడుతున్న మోహన్ గొంతు బరువైంది.

అతనేమన్నాడోఒక్క క్షణం అర్థం కాలేదు రఘుకు. అర్థమైన తర్వాత ఏం మాట్లాడాలో తోచలేదు. మోహన్ ఊహించింది కేవలం ఊహకాదనీ, మింగుడుపడని ఓ చేదైన వాస్తవమనీ అతనికి తెలుసు. ఎప్పటికైనా ఆ వాస్తవాన్నిఎదుర్కోవాల్సిందేనన్న విషయం కూడా అతనికి ముందునుంచే బాగా తెలుసు. కానీ, ఇప్పుడా వాస్తవం అతని చేరువలో కొచ్చినట్లయింది. . . అతన్ని చేరుకోనుంది. ఒక్కసారి బాధతో మూలిగిందతని హృదయం.

ఏమీ మాట్లాడకుండా నిల్చున్న మోహన్ వైపు చూశాడు రఘు. బహుశ అతను కూడా యిదే ఆలోచిస్తూ వుంటాడనిపించింది. మూగగా, మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్లిపోయాడు రఘు.

అలా ఆలోచిస్తూ ఎంతసేపు క్యూలో నిల్చున్నాడో అతనికే తెలియదు. ఉన్నట్టుండి కళ్లముందు కౌంటర్లో వున్న మనిషి ఏదో అరుస్తూండటంతో ఆలోచనల్లోంచి వాస్తవంలోకొచ్చాడు రఘు.

"అప్లికేషనీవయ్యా అంటే అలా వెర్రి మొహంతో చూస్తావేంటి? ఇంత 'మఫ్ మనిషివి నీకేం వుద్యోగం వస్తుందీ?"

ఆ మాటతో పూర్తిగా ఆలోచనల్లోంచి బయటపడ్డాడు రఘు. క్షణం పాటు అతని మనసులో ఏదో సందిగ్ధం. అంతే.

మరుక్షణం --

"అవసరం లేదులే . . . నేను అప్లయి చేయడం లేదు!" అంటూ క్యూలోంచి విసురుగా బయటకొచ్చాడు. మోహన్ ఏదో చెబుతున్నా పట్టించుకోకుండా సరాసరి గేటు దగ్గరకెళ్ళి నిల్చున్నాడు.

రెండు నిమిషాల తర్వాత అప్లికేషన్ కౌంటర్లో యిచ్చేసి, చేతిలో అక్నాలెడ్జిమెంటు కార్డుతో అదరాబదరా రఘు నిల్చున్న చోటుకు వచ్చాడు మోహన్.

"ఏమైంది నీకు . . . అలా వచ్చావేంటి?"

**గుండెకు సంబంధించిన వ్యాధుల గురించి పాఠకులు అడిగే ప్రశ్నలకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డా॥ వై.వి. రావుగారు (విజయవాడ) సమాధానాలిస్తారు. పాఠకులు తమ ప్రశ్నల్ని ప్రతినెలా 15వ తారీఖులోపు 'ఆహ్వానం' కార్యాలయానికి పంపవల్సిందిగా మనవి.**

**- ఎడిటర్**

"నాకెలాగూ ఈ వుద్యోగం రాదు . . ." ఎటో చూస్తూ గంభీరంగా అన్నాడు రఘు. అతని కళ్ళల్లో నీటి చెమ్మ వూరుతోంది. కన్నీళ్ళు బయటకి రాకుండా పెదవుల్ని కొరుక్కొంటున్నాడు.

"అలా ఎందుకనుకుంటావు?"

"నిజమే అనుకుంటున్నాను. ఇప్పటివరకూ - నా తల్లిదండ్రులు పడుతున్న కష్టం గురించి ఆలోచిస్తూ, వాళ్ళ ఆశల్ని నిజం చేయగలనోలేదోనని బాధపడుతూ, నా భవిష్యత్తు ఎలా వుంటుందోనని భయపడుతూ, జారిపోతున్న ఏకాగ్రతను కూడబెట్టుకుంటూ చదివేవాన్ని. ఇప్పుడు - ముంచుకొస్తున్న వయస్సు వీటికి తోడైంది! ఇన్ని ఆందోళనలు నా మనస్సును తొలిచి, ఛిద్రం చేస్తుంటే లక్షల మందితో పోటీపడుతూ నేను చదవాలి! నాలాగే ఎందరో పోటీపడినా వుద్యోగం వచ్చేది అరవైమందికే! ఇదో లాటరీ . . . ఇదో జూదం! ఈ అరవైమందిలో నేనుండాలని లేదు. నాతో పాటు, వుద్యోగం రాని మిగతావాళ్ళంతా ప్రతిభలేనివాళ్ళా? దురదృష్టవంతులా? వాళ్ళు చదివిన చదువులూ, సంపాదించిన గోల్డుమెడల్సూ అన్నీ వ్యర్థమా?" ఆవేశంలో బిగ్గరగా అంటున్న రఘు కళ్ళల్లో తన ప్రతిబింబాన్ని చూసుకునే ప్రయత్నం చేశాడు మోహన్.

అప్పటికే అక్కడ మరో పదిమంది చేరారు. ఒక్కొక్కరుగా, తన చుట్టూ చేరుతున్న అభ్యర్థులను చూస్తోంటే రఘులో ఆవేశం మరింత ఎక్కువైంది. "ఎమ్మేలు,ఎమ్మె స్సీలు చదివినా మనం పనికిరానివాళ్ళం . రాని వుద్యోగాలకోసం లాటరీలనాడే జూదగాళ్ళం! తెలిసో, తెలీకో యిన్నాళ్ళూ ఈ జూదంలో భాగమయ్యాన్నేను. ఇంక నేను మోసపోదల్చుకోలేదు . . . ఈ జూదమాడలేను!"

ఆవేశంతో ఊగిపోతున్న రఘు మాటల్లో ఓ నిర్వేదం, ఓ నిరాసక్తత, ఓ నిరసన!

మోహన్‌తోపాటు, అతని చుట్టూ చేరిన అభ్యర్థులకు కూడా అతని మాటల్లో తప్పు పట్టాల్సిందేమీ కన్పించలేదు. అందరిలోనూ అదే నిర్వేదం, అదే నిరాసక్తత, అదే నిరసన . . .

ఇదంతాచూస్తుంటే, తనలో తానే ఏదో గొణుక్కుంటూ, గేటు దగ్గర కూర్చున్న ముసలి వాచ్‌మెన్ బీడీ వెలిగించుకోడానికి అప్పుడే జేబులోంచి అగ్గిపెట్టె బయటికి తీశాడు. చేతిలోని కాంపిటీషన్ మాస్టర్లో వున్న కవర్లోంచి అప్లికేషన్ బయటకు తీశాడు రఘు. వాచ్‌మెన్ చేతిలోంచి అగ్గిపెట్టె లాక్కుని నెమ్మదిగా ఆ అప్లికేషన్ చివర్లని అంటించాడు.

తన అగ్గిపెట్టెతో, తన కళ్ళముందే జరుగుతున్నది చూసి నోరు తెరిచాడు వాచ్‌మెన్.

చివర్లనుంచి పైకి కాలుకుంటూ వస్తున్న అప్లికేషన్ను అక్కడే గేటుముందు నెమ్మదిగా జారవిడిచాడు రఘు. అది ఆరిపోకముందే చేతిలోవున్న కవర్నీ, మేగజైన్నీ కూడా ఆ మంటల్లో వేశాడు. ఇప్పుడా మంట మరింత పెద్దదైంది. దాని చుట్టూ మనుషులు కూడా ఎక్కువయ్యారు.

అప్రయత్నంగా, మోహన్ కూడా తన చేతిలో వున్న అక్నాలెడ్జిమెంటు కార్డును నెమ్మదిగా ఆ మంటలోకి జారవిడిచాడు. ఆ వెంటనే, చుట్టూవున్న గుంపులోంచి మరో అప్లికేషన్ ఆ మంటలో పడింది. అది ఆరిపోకూడదన్నట్టుగా, ఒకదాని వెంట మరొకటి అప్లికేషన్లు వరుసగా ఆ మంటలో పడుతూనే వున్నాయి. తగలబడిపోతూనే వున్నాయి. తగలబడిపోతున్న ఆ అప్లికేషన్ల గుట్టమీదుగా 'రపరప'మంటూ శబ్దం చేస్తూ ఇప్పుడు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి మంటలు . . . .

కొద్ది నిముషాల క్రితం వరకూ, క్యూలో నిల్చుని వున్న నిరుద్యోగజనమంతా ఇప్పుడా మంటల చుట్టూ ఓ ప్రభంజనంలా నిల్చుని వున్నారు. ఇన్నాళ్ళు తమ ఆశల్లో, ఆశయాల్లో, ఆలోచనల్లో అపురూపంగా చూసుకున్నట్టుగా గంభీరంగా వున్నారంతా.

ఏళ్ళ తరబడిగా, గూళ్ళు కట్టుకున్న గబ్బిలాల్లా వేలాడుతూ, వారి కాళ్ళలో కొలువుదీరివున్న నిరాశా నిస్పృహలు కూడా ఆ మంటల్లోనే కలిసి, కరిగిపోయాయి.

ఎగిసిపడుతున్న ఆ మంటల చైతన్యం వారి కళ్ళల్లో ప్రతిబింబిస్తోంది.

వారి గమ్యమేమిటో ఇప్పుడు వారికి తెలుసు. ●

